
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శనివారం, ఫిబ్రవరి 21, 2026 పేజీలు:6





యూరియాయాప్‌తో.. రైతులకు యూరియా

# అందజేయాలి

## - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 20**
**(ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

రైతులకు యూరియా పంపిణీని సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. యూరియా సరఫరా వ్యవస్థనుసమర్థవంతంగానిర్వహించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అధికారులతో యూరియా పంపిణీని, యాప్ వినియోగం పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో యూరియా పంపిణీ యాప్ వినియోగం, ఫార్మర్ ఐడీ నమోదు పురోగతిపై కలెక్టర్ వ్యవసాయ అధికారులతో మండలాల వారిగా చర్చించారు. జిల్లాలో జనవరి 29 నుండి అమల్లోకి వచ్చిన యాప్ ద్వారా ఇప్పటివరకు 45,972 మంది రైతులు 2,09,000 యూరియా బ్యాగులను కొనుగోలు చేయగా, 9,405 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ జరిగినట్లు తెలిపారు.

రైతులు అవసరమైన కోటాను ఇంటి వద్ద నుంచే ముందస్తుగా బుక్ చేసుకుని పొందుతున్నారని చెప్పారు. గత 2024-25 సంవత్సరంలో ఇప్పటివరకు 24,876 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయగా, ప్రస్తుత 2025-26 సంవత్సరంలో ఇప్పటివరకు 33,555 మెట్రిక్ టన్నుల యూరియాను

- మిగతా 2లో..

సర్పంచ్‌లు అధికారాలు, బాధ్యతలపై పూర్తి

# అవగాహన కలిగి ఉండాలి

## - కలెక్టర్ విజయేందిర బోయి




**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20**
**( ప్రజా జ్యోతి బ్యూరో )**

గ్రామపంచాయతీ సర్పంచులు తమ విధులు, అధికారాలపై సంపూర్ణ అవగాహనతో పనిచేసినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా బండమీదిపల్లిలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ శిశు సంక్షేమ కేంద్రంలో రాజాపూర్, బాలానగర్, నవాబ్‌పేట్ మండలాలకు చెందిన కొత్తగా ఎన్నికైన సర్పంచుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్

- మిగతా 2లో..

ముదిరాజ్ సమాజానికి

# చారిత్రాత్మక గుర్తింపు

## - ఎమ్మెల్యేకు ఘన సన్మానం
## - మహబూబ్‌నగర్ తొలి మేయర్‌గా మమత ఎంపికపై కృతజ్ఞతలు

2లో



అర్హులైన ప్రతి కుటుంబానికి

# ఇందిరమ్మ ఇల్లు

## -నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్. రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్: ఫిబ్రవరి 20**
**ప్రజా జ్యోతి**

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజురుఅవుతుందని ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ళ రాజేష ండ్డి అన్నారు.శుక్రవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని 20వ,వార్డ్ లో మరియు బిజినపల్లి మండలపరిధిలోని గంగారంలో నూతనంగా నిర్మించినఇందిరమ్మ ఇళ్లగృహ ప్రవేశం కార్యక్రమాలలో పాల్గొని ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా

- మిగతా 2లో..

## యూరియాయాప్‌తో.. రైతులకు యూరియా

# అందజేయాలి

రైతులకు అందజేసినట్లు వెల్లడించారు. జిల్లాకు అవసరమైన 20 వేల మెట్రిక్ టన్నుల యూరియాను తక్షణమే తెప్పించాలని అధికారులను ఆదేశించారు.
ఇప్పటికే నేరుగా యూరియా తీసుకున్న రైతులు మళ్లీ యాప్ ద్వారా నమోదు చేసుకుంటే అలాంటి వారిని గుర్తించి జాగ్రత్తగా పంపిణీ చేయాలని సూచించారు. అవసరానికి మించి యూరియా అందజేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లాలో 3,28,381 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 1,82,760 మంది మాత్రమే ఫార్మర్ ఐడీ నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. 100 శాతం ఫార్మర్ ఐడీ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడానికి, పంటలను విక్రయించడానికి మరియు పీఎం కిసాన్ తదుపరి విడత లబ్ధి పొందేందుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని తెలిపారు.
ఫార్మర్ ఐడీ నమోదు కోసం రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నెంబర్‌తో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.నమోదుపై తలెత్తే సాంకేతిక సమస్యలపై రాష్ట్రస్థాయిఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, డివిజన్ అధికారులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## ముదిరాజ్ సమాజానికి చారిత్రాత్మక గుర్తింపు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా జి. మమత ఎంపికైన సందర్భంగా మహబూబ్‌నగర్ నగర ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం నాయకుడు ఎన్.పి. వెంకటేష్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం సాధనలో భాగంగా ముదిరాజ్ వర్గానికి తొలి మేయర్ పదవి కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. గతంలో అనేక వర్గాలకు అవకాశాలు లభించినప్పటికీ, ముదిరాజ్ సమాజానికి ఇలాంటి గౌరవప్రదమైన స్థానం దక్కడం ఇదే తొలిసారిగా జరుగుతోందని పేర్కొన్నారు.
ఈ అవకాశాన్ని కల్పించిన ఘనత ఎమ్మెల్యేదేనని, ఇందుకు సమాజం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైత్రి యాదయ్య మాట్లాడుతూ, ఎమ్మెల్యే నాయకత్వం ముదిరాజ్ వర్గ గౌరవాన్ని మరింత పెంచిందన్నారు. ముదిరాజ్ సమాజానికి రాజకీయ ప్రాతినిధ్యం బలపడిందని తెలిపారు. యువత సాధికారత, సమాజ అభివృద్ధి దిశగా ఎమ్మెల్యే నాయకత్వంలో ముందుకు సాగేందుకు తామంతా కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి సామాజిక వర్గానికి సమాన అవకాశాలు కల్పించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం, మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అన్ని వర్గాలు కలిసికట్టుగా అభివృద్ధి పథంలో నడవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రామకృష్ణ, నాయకులు ఆంజనేయులు, రాచాల మురళి, కరిగి ఆంజనేయులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జనార్ధన్, రమేష్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, గంజి శ్రీను, బండ్లగేరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు అధికారాలు, బాధ్యతలపై పూర్తి

# అవగాహన కలిగి ఉండాలి

ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణ ద్వారా సర్పంచులు తమ అధికారాలు, బాధ్యతలపై సమగ్ర అవగాహన పొందాలని సూచించారు. గ్రామాల్లో తారతమ్యాలు లేకుండా అందరినీ కలుపుకొని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని అన్నారు. ముందుగా కొత్తగా ఎన్నికైన సర్పంచులకు అభినందనలు తెలియజేసి, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. “సర్పంచ్ అంటే ఏమిటి?” అనే ప్రశ్నకు “గ్రామ పాలకుడు” అని సర్పంచులు సమాధానమిచ్చారు.రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా 1993లో పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చిందని, సర్పంచుల పదవీకాలం ఐదేళ్లు ఉంటుందని తెలిపారు. నియమిత ఎన్నికలు నిర్వహించినప్పుడే గ్రామాలకు అభివృద్ధి నిధులు అందుతాయని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీ చట్టంలోని సెక్షన్ 32, సెక్షన్ 42లపై పూర్తి అవగాహన అవసరమని సూచించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించడం తప్పనిసరి అని, సంవత్సరానికి కనీసం ఆరు గ్రామసభలు జరగాలని పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామసభలు నిర్వహించని పక్షంలో సర్పంచ్‌ను సస్పెండ్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని హెచ్చరించారు.
గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ ఆధారంగా ఉండవని, రాజకీయ విభజనలు గ్రామ ఐక్యతను దెబ్బతీసే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల ఎలాంటి భేదాభావం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, ఇందిరమ్మ ఇళ్ల వంటి మౌలిక వసతులను ముఖ్యంగా పేదలు, అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యమిస్తూ కల్పించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ ఆదాయం, వ్యయాలను పారదర్శకంగా నిర్వహిస్తూ స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.సెక్షన్ 42 ప్రకారం రోగాలు, మహమ్మారులు, భారీ వర్షాలు, వరదలు వంటి అత్యవసర పరిస్థితుల్లో సర్పంచ్‌లకు ఉన్న ప్రత్యేక అధికారాలను సమర్థంగా వినియోగించాలని తెలిపారు. ప్రభుత్వం అందజేసిన పంచాయతీరాజ్ రూల్ బుక్‌ను పూర్తిగా అధ్యయనం చేసి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమీప పాఠశాలలను సందర్శించి ముఖ్యంగా పదో తరగతి విద్యార్థుల హాజరును పర్యవేక్షించాలని సూచించారు. తల్లిదండ్రులను చైతన్యపరచి పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపేలా ప్రోత్సహించాలని అన్నారు. పదో తరగతిలో విఫలమైతే వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం ఉంటుందని తెలిపారు.అలాగే రైతులు ప్రభుత్వ సబ్సిడీలు, ఆర్థిక సహాయం పొందేందుకు పిఎం కిసాన్ పోర్టల్‌లో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సర్పంచ్‌లను కోరారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ డీపీవో నిఖిల, ఎంపీడీవోలు, సర్పంచులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదం

**- మినీ ట్రావెల్స్, ఆర్టీసీ బస్సు ఢీ**

**- ఒకరి పరిస్థితి విషమం, 18 మందికి గాయాలు**

అమ్రాబాద్, ఫిబ్రవరి 20
శ్రీశైలం ఘాట్ రోడ్డులో శుక్రవారం రాత్రి మినీ ట్రావెల్స్, ఆర్టీసీ బస్సు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో లక్ష్మయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. భాదితుల వివరాల ప్రకారం హైదరాబాద్ ఘట్కేసర్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు దైవదర్శనర్థశీ మైసిగండి మద్దిమడుగు దేవాలయాలకు వెళ్లి శ్రీశైలం బయలుదేరినట్లు తెలిపారు. వరవర్లపల్లి సమీపంలోని రాసుమల్ల బావి వద్ద ఎదురుగా వస్తున్న మహబూబ్నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుందని వారు తెలిపారు. 108 అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రులను అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు.

### అర్హులైన ప్రతి కుటుంబానికి

# ఇందిరమ్మ ఇల్లు

ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు గృహ వసతి కల్పించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు,ఇంద్రమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.అదేవిదంగా గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,గ్రామీణ రోడ్లు,నీటి సదుపాయం,విద్యుత్ వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,పార్టీ నాయకులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నియోజకవర్గం అభివృద్దే నా ధ్యేయం..

**రాష్ట్రానికి మోడీ రూపాయి ఇవ్వడం లేదు..**
**సీఎం చొరవతో అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తా..**
**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

కల్వకుర్తి: ఫిబ్రవరి 20: నియోజకవర్గం అభివృద్దే నా ధ్యేయం అని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో నూతన చైర్మన్ బృంగి రత్నమాల పదవి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చైర్మన్ రత్నమాలకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో అధిక నిధులు తీసుకువచ్చి కల్వకుర్తి, ఆమనగల్ పట్టణాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ పాలన సాగిస్తామని అన్నారు. ఇకనుంచి రాజకీయాల కంటే ఎక్కువగా అభివృద్ధిపై దృష్టి పెడతానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోడీ రూపాయి ఇవ్వడం లేదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని పర్యాయాలు కలిసిన స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్ మున్సిపాలిటీ చైర్మన్ పదవిపై నాకు ఏమి సంబంధం అని అన్నారు. మీ పార్టీ కౌన్సిలర్లను కాపాడడంలో విఫలం చెందిన మీరు తనపై నిందలు వేయడం సరికాదని బిఆర్ఎస్ నేత ఉప్పల వెంకటేష్ పై పరోక్షంగా ఎమ్మెల్యే విమర్శలు సంధించారు. మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. తప్పుడు పనులు చేయాలని తన ఆలోచన కాదని దానికి నేను పూర్తి వ్యతిరేకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీ మల్లురవి సమక్షంలో పత్యానాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని అట్టి విషయాన్ని తనకు ఆపాదించడం బిఆర్ఎస్ నాయకులకు తగదని హెచ్చరించారు. తన మంచితనాన్ని చులకనగా చూడొద్దని తాను గర్జిస్తే గాలిలో కొట్టుకుపోతారని ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్, కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం చైర్మన్ రత్నమాల మాట్లాడారు.. ఎమ్మెల్యే సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి ఠాగూర్ బాలాజీ సింగ్, ఆర్డీవో జనార్దన్ రెడ్డి, డి.ఎస్.పి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ ఇబ్రహీం, కమిషనర్ మహమూద్ షేక్, మున్సిపల్ వైస్ చైర్మన్ శాన్ వాజ్ ఖాన్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కౌన్సిలర్లు, పట్టణ పుర ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆదర్శ మున్సిపాలిటీ దిశగా గద్వాల అడుగులు

## నూతన చైర్‌పర్సన్‌గా తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్ బాధ్యతల స్వీకరణ





**గద్వాల ఫిబ్రవరి 20(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
గద్వాల మున్సిపాలిటీలో నూతన మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మున్సిపల్ చైర్‌పర్సన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్లు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్ మొదటి సంతకం చేసి అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.కార్యక్రమంలో బ్రాహ్మణులు,ముస్లిం మత పెద్దలు,చర్చి పాస్టర్లు చైర్‌పర్సన్‌కు ఆశీర్వాదాలు అందించారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా చైర్‌పర్సన్,వైస్ చైర్మన్‌లను శాలువా కప్పి సత్కరించగా,ఎమ్మెల్యేకు ప్రత్యేక నెమలి దండతో ఘనంగా సత్కారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతన చైర్మన్,వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గద్వాల ప్రజలు మీపై నమ్మకం ఉంచి కౌన్సిలర్లుగా ఎన్నుకున్నారని,ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రివర్గం సహకారంతో ప్రత్యేక నిధులు సమకూర్చి గద్వాల మున్సిపాలిటీని రాష్ట్రంలో ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.నూతన చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్ మాట్లాడుతూ,తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పట్టణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ పారిశుద్ధ్యం,వీధి దీపాలు,రహదారులు,డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా కృషి చేస్తామని తెలిపారు.ఎమ్మెల్యే సహకారంతో గద్వాల మున్సిపాలిటీని రాష్ట్రంలో ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి పనిచేస్తామని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు,ప్రజాప్రతినిధులు,వైస్ చైర్మన్,కౌన్సిలర్లు,పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన మునిసిపల్ చైర్మన్

**కొల్లాపూర్ ఫిబ్రవరి 20 ప్రజా జ్యోతి**
కొల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రెడ్డి జ్యోతి వైస్ చైర్మన్ మహమ్మద్ రహీం పాషా సంబంధిత అధికారులు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకదానికి ఒకటి నెరవేర్చుకుంటూ ప్రభుత్వ ముందుకు వెళుతుందని వివరించారు. అందులో భాగంగా ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించాలని ఆయా అధికారులకు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ నిరుపేదల సంక్షేమం కోసం ప్రజల అభిప్రాయం మేరకు మునిసిపాలిటీ అభివృద్ధి దిశగా ముందడుగు పనిచేస్తుందని మాట్లాడారు. అందులో భాగంగానే నిజమైన లబ్ధిదారులకు పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లను రాష్ట్ర ఎక్సైజ్.పర్యాటక టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలుజారీచేశారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపం లేకుండా చూడాలని అధికారులకు మేస్త్రీలకు మునిసిపల్ చైర్మన్ సూచించారు.కార్యక్రమంలో. మాజీ కౌన్సిలర్ బరిగెల రాముడు యాదవ్ వార్డు సభ్యులు నాయకులు తదితరులున్నారు.

# శిక్షణ పూర్తి చేసుకొని గద్వాల జిల్లాకు చేరిన పోలీస్ జాగిలం ఆర్య



**గద్వాల ఫిబ్రవరి 20(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
జోగుళాంబ గద్వాల్ జిల్లాకు కేటాయించబడిన పోలీస్ జాగిలం ఆర్యతో,డాగ్ హ్యాండిలర్ భీమేష్,ఎ.ఆర్.పిసి 2929,డాగ్ స్క్వాడ్ ఇన్చార్జి రవికుమార్,ఎ.ఆర్.పిసి 2721,ఆర్.ఐ.లు నరేష్,వెంకటేష్ లు మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావుని కలవడం జరిగినది.ఐఐటిపి మొయినాబాద్ నందు ఎనిమిది నెలల బేసిక్ ట్రైనింగ్ ను పూర్తి చేసుకున్న ఆర్య జోగుళాంబ గద్వాల జిల్లాకు కేటాయించినట్లు,ఆర్య ప్రేలుడు పదార్థాలు కనుగొనడంలో ప్రత్యేకంగా శిక్షణ పొందినట్లు ఆర్.ఐ.నరేష్ ఎస్పీకి తెలిపారు.అనంతరం పోలీస్ జాగిలానికి హ్యాండిలర్ గా వ్యవహరిస్తున్న ఎ.ఆర్ కానిస్టేబుల్ భీమేష్ ఆర్డర్ ప్రకారం పోలీస్ జాగిలం ఆర్య,జిల్లా ఎస్పీకి రిపోర్ట్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,ప్రస్తుతం జిల్లాకు కేటాయించబడిన ఎక్స్ ప్లోసివ్ డిటెక్టర్ జాగిలం ఆర్య తో పాటు ఒక నార్కోటిక్ జాగిలం జిమ్మీ,రెండు ట్రాకర్స్ చార్లీ,హనీ జాగిలాలు ఉన్నట్లు తెలిపారు.జాగిలాలకు వసతి ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, కాలానుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సంరక్షించాలని డాగ్ హ్యాండిలర్,డాగ్ స్క్వాడ్ ఇన్చార్జిలకు తెలిపారు.అలాగే నూతనంగా చేరిన ఎక్స్ ప్లోసివ్ డిటెక్టర్ ఆర్యతో జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ విభాగం మరింత అప్రమత్తంగా సమర్థవంతంగా సేవలందించేందుకు సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావుతో పాటు అదనపు ఎస్పీ కె.శంకర్,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నరేష్, వెంకటేష్,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి,డాగ్ హ్యాండ్లర్ భీమేష్,డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సైడ్ కాలువ నిర్మాణానికి 25 లక్షల రూపాయలు శాంక్షన్



**కొల్లాపూర్ ఫిబ్రవరి 20 ప్రజా జ్యోతి**
మునిసిపల్ పట్టణ పరిధిలో ఉన్న15 వ,వార్డు చుక్కయపల్లి రోడ్డు దగ్గర సైడ్ కాలువ నిర్మాణానికి 25 లక్షల రూపాయలు శాంక్షన్.మున్సిపల్ సిబ్బందితో నిర్మించబోయే కాలువ స్థలాన్ని పరిశీలించిన 15 వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ మనపాడు నరసింహా వారి వెంట ఎస్టిమేషన్ పురపాలక అధికారి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతులు ధర్నా



**కొల్లాపూర్ ఫిబ్రవరి 20 ప్రజా జ్యోతి**
పెద్ద కొత్తపల్లి మండల పరిధిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరమతి సంఘం కార్యాలయం ముందు శుక్రవారం రోజు యూరియా కోసం రైతులు ధర్నా. ప్రాథమిక సొసైటీకి ఈరోజు ఉదయము 900 బస్తాల యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న చుట్టుముట్టు పక్కల గ్రామాల రైతులు యూరియా కోసం సొసైటీ ఆఫీసుకు తరలివచ్చారు. యూరియా కోసం ఆన్లైన్లో అప్లై చేసుకోవడానికి స్మార్ట్ఫోన్లు మా దగ్గర లేవని మేము రైతులము అలా చేసుకోవడానికి మాకు ఏ యాప్ లో ఉన్నది అని తెలుసుకోవడానికి కూడా మాకు చదువు తెలియని రైతులమని అని సొసైటీ ఆఫీస్ ముంగట అధికారులకు వారి ఆవేదనలు వ్యక్తం చేశారు. మా దగ్గర ప్రభుత్వ అందించిన పాసుబుక్కులు మాత్రమే ఉన్నాయి వాటి ద్వారా యూరియా బస్తాలను అమలు చేయాలని రైతులు సొసైటీ ముందర వారి ఆవేదనలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సొసైటీ దగ్గర రైతులు ఆందోళన చేస్తున్న విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ సతీష్ తెలుసుకొని సొసైటీ కార్యాలయం దగ్గరికి చేరుకొని రైతులు ఆందోళన చేస్తున్న విషయాన్ని గమనించి మీ డిమాండ్లను సంబంధిత వ్యవసాయ అధికారుల దృష్టికి తెలియపరిచే విధంగా సహకరిస్తామని రైతులకు స్థానిక ఎస్సై సతీష్ భరోసా ఇవ్వగా రైతులు ధర్నాను విరమించుకున్నారు.

# పదవి చేపట్టిన వెంటనే ప్రజాసేవకు శ్రీకారం

## -ముళ్ల,పొదలు,పిచ్చి మొక్కల తొలగింపు ఐజ రెండో వార్డులో ముమ్మరంగా సాగుతున్న క్లీనింగ్ పనులు

ఐజ ( ప్రజా జ్యోతి) ఫిబ్రవరి 20 : ఐజ
మున్సిపాలిటీ చైర్మన్ సీఎం.సురేష్ ఆదేశానుసారం శుక్రవారం ఐజ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు కోట్ల వీధిలో ఏపుగా పెరిగిన ముళ్ళ కంపలు,పొదలు మరియు వాగులోని పిచ్చి మొక్కలను రెండో వార్డు కౌన్సిలర్ రజాక్ దగ్గరుండి క్లీన్ చేయించారు.ప్రజలకు ఇబ్బందిగా మారిన ఈ పొదలను మరియు వాగులోని చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. మున్సిపల్ చైర్మన్ సీయం సురేష్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజల ఇబ్బందులను తొలగించే దిశగా వేసిన మొదటి అడుగు ఇది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి,మౌల,అంజి మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.





# జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సర్వసభ్య సమావేశం

### రూ. 1.29 కోట్ల అభివృద్ధి తీర్మానాలకు ఆమోదం

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

జిల్లా గ్రంథాలయ సంస్థ మహబూబ్ నగర్ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించబడింది. సమావేశంలో గ్రంథాలయాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అడ్డకల్ శాఖా గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఇందుకోసం సంబంధిత ఇంజినీరింగ్ విభాగమైన తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషనల్ వర్క్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అంచనాలు సిద్ధం చేయించి, పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుల పరిపాలన అనుమతి పొందిన తర్వాత నిర్మాణ పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ పనుల కోసం రూ. 1.00 కోటి ఖర్చు చేయాలని ప్రతిపాదించారు.

అదనంగా, గ్రంథాలయాల అభివృద్ధి కోసం క్రింది వ్యయాలను కూడా ఆమోదించారు:

ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు -- రూ. 3.60 లక్షలు
గ్రంథాలయాలకు ఫర్నిచర్ కొనుగోలు -- రూ. 3.00 లక్షలు
పుస్తకాల డిజిటలైజేషన్ -- రూ. 5.00 లక్షలు
గ్రంథాలయ భవనాల మరమ్మత్తులు -- రూ. 10.00 లక్షలు



పౌర పఠన మందిరాల ఏర్పాటు -- రూ. 6.00 లక్షలు
దృష్టిలోపం గల పాఠకుల సదుపాయాలు -- రూ. 2.00 లక్షలు

మొత్తంగా రూ. 1.29 కోట్ల వ్యయంతో గ్రంథాలయాల అభివృద్ధి చర్యలు చేపట్టేందుకు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, జడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి, డీపీఆర్వో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

# స్వేరో పలకరింపు

**- మాజీ జెడ్పిటిసి బాలకిష్టయ్య మృతిపై నేతల సంతాపం**
**-మరణం విషాదం కాకూడదు... ప్రేరణాత్మక ఆత్మప్రబోధ కావాలి**





**చిన్నంబావి, ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి):**

చిన్నంబావి మండలంలోని వెల్లటూర్ గ్రామంలో ఇటీవల వరుస విషాద సంఘటనలతో శోకసంద్రంగా మారింది. ఉమ్మడి వీపనగండ్ల మండల మాజీ జెడ్పిటిసి పరమళ్ల బాలకిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందడం గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలో సర్వోస్ వ్యవస్థాపక అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం వెల్లటూర్‌కు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, చిన్నంబావి మండల మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పిటిసి వెంకటరమణమ్మ, మాజీ సర్పంచ్ రంజిత్, పురంధర్ రెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా బాలకిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంస్మరణ కార్యక్రమంలో ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భావోద్వేగంగా మాట్లాడుతూ, "ఒక మనిషి మరణం కుటుంబానికి తీవ్ర విషాదం కలిగించినా, అదే సంఘటన సమాజానికి ఓ గుణపాఠంగా మారాలి. అలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా మనం జాగ్రత్తలు తీసుకోవాలి. మరణాన్ని జల్సాగా మార్చుకోవడం, మద్యం సేవిస్తూ వేడుకలుగా మార్చడం సభ్య సమాజానికి తగదు" అని స్పష్టం చేశారు. అనారోగ్య సమస్యలు, నిర్లక్ష్యం, మత్తు పదార్థాల అలవాట్లు వంటి కారణాల వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, మద్యం వంటి మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. "మరణం విషాదంగా మిగలకూడదు... అది మనల్ని మేల్కొలిపే ఆత్మప్రబోధంగా మారాలి" అని పిలుపునిచ్చారు. "అక్షరం--ఆర్థికం--ఆరోగ్యం--ఆత్మగౌరవం" అనే నాలుగు సూత్రాలతో సర్వోస్ సంస్థను స్థాపించినట్లు ఆయన వివరించారు. సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలను పారదోలుతూ విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో చైతన్యం కల్పించడం సర్వోస్ లక్ష్యమని చెప్పారు. తెలంగాణలో పుట్టి పెరిగిన ఈ ఉద్యమం దేశ విదేశాల్లో విస్తరిస్తోందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "పరమాల బాలకిష్టయ్య నాకు అత్యంత ఆత్మీయుడు. రాజకీయంగా ఎంతో చేరువయ్యారు. ఆయన మరణం చిన్నంబావి మండలానికి తీరని లోటు" అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇదే గ్రామానికి చెందిన చెటమోని నరేష్ భార్య మల్లేశ్వరి (30) పురుగుల మందు ప్రభావంతో మృతి చెందిన ఘటన గ్రామాన్ని మరింత కలచివేసింది. పంట పొలాల్లో స్ప్రే చేస్తుండగా పురుగుమందు వాసన, తుంపర్ల ప్రభావంతో ఆమె స్పృహ తప్పి పడిపోవడంతో వెంటనే వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మల్లేశ్వరికీ పునీత్ (5), హర్షిత్ (3), దక్షత (11 నెలలు) అనే ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఆ చంటి పిల్లల రోదనలు గ్రామస్తుల హృదయాలను కలిచివేశాయి. ఈ విషాదాన్ని తెలుసుకున్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, బీరం హర్షవర్ధన్ రెడ్డి మల్లేశ్వరి కుటుంబాన్ని కూడా పరామర్శించి ధైర్యం చెప్పారు. పిల్లల భవిష్యత్తుకు తమ వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై సానుభూతి వ్యక్తం చేశారు. తదనంతరం లక్ష్మిపల్లి గ్రామ ప్రజలు తమపై నమోదైన కేసుల విషయమై ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ దృష్టికి తీసుకురాగా, ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ నాగరాజుతో చర్చించారు. కేసులు చట్టబద్ధంగానే నమోదు చేశామని ఎస్ఐ వివరణ ఇవ్వగా, అమాయకులను వేధించకూడదని సూచించారు. మొత్తంగా వెల్లటూర్ గ్రామంలో జరిగిన ఈ పరామర్శ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో సాగింది. ఒకరి మరణం కుటుంబానికే కాకుండా సమాజానికీ గుణపాఠంగా మారాలని, ప్రతి విషాదం మనలో చైతన్యాన్ని నింపాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వేరో సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు

మాజీ ఎంపిపి సోమేశ్వరమ్మ , మాజీ జెడ్పీటిసి వెంకటరమణమ్మ చిన్నరెడ్డి, మాజీ సర్పంచ్ గోవింద్ శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఈదన్న, చిన్నమారు సర్పంచ్ శంకర్ వెలగోండ సర్పంచ్ శరత్ రెడ్డి గారు, మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్ గారు, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి శివ రెడ్డి ,స్వరో డైరెక్టర్ బ్రహ్మం ,సంపంగి మద్దిలేటి,స్వామి,మల్లేష్,కే మధు, వంశీ. చిన్నంబావి బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు




# పైలట్ గ్రామంలో వేగంగా ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ సంతృప్తి

**- పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని అధికారులకు ఆదేశం**



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని పోతంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పురోగతి విషయాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పోతంపల్లి గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. పూర్తయిన ఇళ్లను సందర్శించిన కలెక్టర్, లబ్ధిదారులు నిర్మాణానికి ఎంత వ్యయం చేశారో, బిల్లులు సమయానికి అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. ఇళ్ల ప్లింత్ ఏరియా, ఆమోదించిన నమూనాకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా అనే విషయాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి మొత్తం 104 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. అందులో 10 ఇళ్లు పూర్తయ్యాయి. 65 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, మిగిలినవి మార్కింగ్ దశలో ఉన్నాయని వివరించారు.

కలెక్టర్ నక్క హనుమంతు, కుమ్మరి బాలరాజు, జక్కలగల చెన్నమ్మల ఇళ్లను సందర్శించి వారితో మాట్లాడారు. నిర్మాణానికి ఇప్పటివరకు ఎంత ఖర్చు అయ్యిందని, బిల్లులు సమయానికి వచ్చాయా అని అడిగారు. ఒక లబ్ధిదారు మాట్లాడుతూ సుమారు రూ.2 లక్షలు ఖర్చు అయ్యాయని తెలిపారు. గోడల నిర్మాణానికి సంబంధించిన బిల్లు అందిందని, అయితే స్లాబ్ బిల్లు ఇంకా పెండింగ్‌లో ఉందని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆదేశించారు. బిల్లులు ఆలస్యం కాకుండా చూసి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేయగా, పనుల పురోగతిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట్ ఉపేందర్ రెడ్డి, డీఈ విజయ్ కుమార్, ఏఈ ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో టెక్నికల్ అసిస్టెంట్‌కు గాయాలు

**-మానవత్వాన్ని చాటుకున్న ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్ స్వయంగా ఆసుపత్రికి తరలింపు**

**చిన్నంబావి, ఫిబ్రవరి 20(ప్రజాజ్యోతి):**

చిన్నంబావి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్నికల్ అసిస్టెంట్ ఈశ్వరయ్య గాయపడ్డారు. ఈ ఘటనలో ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్ ఏపీఓ ధనుంజయ రాజు మానవత్వంతో స్పందించి స్వయంగా ఆసుపత్రికి తరలించడం ప్రశంసనీయంగా మారింది. వివరాల ప్రకారం... విధులకు హాజరవుతున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై చిన్నంబావి వైపు వస్తుండగా మార్గమధ్యంలో కుక్కలు ఒకేసారిగా గుంపులుగా రోడ్డుపైకి రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఈశ్వరయ్య కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. అధికారిగా మాత్రమే కాకుండా మనిషిగా స్పందించిన ఎంపీడీవో చర్యలను స్థానిక ప్రజలు, సిబ్బంది అభినందించారు. సత్వర స్పందనతో మానవతా విలువలను చాటుకున్నారని మండల ప్రజలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు ఏపీఓ, ఉపాధి హామీ సిబ్బంది కంప్యూటర్ ఆపరేటర్ శివయ్య, భాస్కర్ రెడ్డి, ఈశ్వర్, ఈసీ వెంకటేష్, టెక్నికల్ అసిస్టెంట్ మేకల గోపాల్ తదితరులు పాల్గొన్నారు



# గురుకులంలో తనఖీ...

-విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్

- ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థినులకు మార్గదర్శనం



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

మహబూబ్‌నగర్ జిల్లా చిట్టిబోయినపల్లిలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ శుక్రవారం తనఖీ చేశారు. పాఠశాలలో విద్యా పరిస్థితులు, వసతులు పరిశీలించి విద్యార్థినులతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో కలిసి భోజనం చేసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్సెస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమై పరీక్షలు ఎలా సమర్థవంతంగా రాయాలో మెలకువలు వివరించారు. సమయపాలన, ప్రశ్నాపత్రం విశ్లేషణ, ముఖ్యాంశాలపై దృష్టి సారించడం వంటి అంశాలపై సూచనలు చేశారు.చదువుతున్న సమయంలో ఏదైనా సబ్జెక్టులో సమస్యలు ఎదురైతే తమ తోటి విద్యార్థినులతో గ్రూప్ చర్చలు నిర్వహించుకోవాలని సూచించారు. పరస్పర చర్చల ద్వారా సందేహాలు నివృత్తి చేసుకోవడం వల్ల అవగాహన పెరుగుతుందని చెప్పారు. అలాగే నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, లక్ష్యసాధన కోసం క్రమశిక్షణతో కృషి చేయాలని విద్యార్థినులకు హితవు పలికారు. విద్యే భవిష్యత్తుకు బలమైన ఆధారం అని, ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# ఘనంగా వీడ్కోలు సమావేశం



**ఎర్రవల్లి/ఇటిక్యాల:(ప్రజా జ్యోతి)ఫిబ్రవరి 20:**

ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వనపర్తి జిల్లా కు బదిలీపై వెళ్తున్న(ఫార్మసిస్ట్)విక్షపతి (ల్యాబ్ టెక్నీషియన్) ధనలక్ష్మిని మండల వైద్యాధికారి రాధిక తోటి సిబ్బంది శాలువా పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలను అందజేసి అనంతరం వారి చేసిన సేవలను కొనియాడారు,

# యువత ప్రతిభకు సీఎం కప్ వేదిక

-రాష్ట్ర స్థాయి పోటీలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శ్రీకారం





**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

“యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే మహత్తర సాధనం క్రీడలే” అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో 2వ ఎడిషన్ రాష్ట్ర స్థాయి సీఎం కప్--2025 పోటీలు (బాక్సింగ్, నెట్‌బాల్) ఉత్సాహభరిత వాతావరణంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే పరిమితం కాకుండా మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమయపాలన, సహనశక్తి వంటి విలువలను పెంపొందించే శక్తివంతమైన సాధనమని తెలిపారు. రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు యువ క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునే గొప్ప వేదికగా నిలుస్తాయని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం లభిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మహబూబ్‌నగర్ జిల్లా పేరు గర్వంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి స్వయంగా క్రీడాకారుడిగా ఉండటంతో యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్పోర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ సౌకర్యాలు, ప్రోత్సాహక పథకాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. క్రీడలు యువతను చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడతాయని పేర్కొంటూ, గెలుపు--ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. భవిష్యత్తులో జిల్లా స్థాయిలో మరిన్ని జాతీయ స్థాయి పోటీలను నిర్వహించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మేయర్ జి. మమత శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్లు ఉమర్ కొత్వాల్, సిజి శ్రీపూజి, టి. రమేష్ బాబు, నాయకులు సిజె బెనహర్, గోపాల్ యాదవ్, డివైఎస్ఓ శ్రీనివాస్, క్రీడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేఘారెడ్డి సమక్షంలో పాత తాండ సర్పంచ్ కాంగ్రెస్ గూటికి

- రేవెల్లి మండలంలో కాంగ్రెస్ జోరు -సర్పంచ్ సహా 50 మంది చేరిక



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 20 (ప్రజాజ్యోతి):**

రేవెల్లి మండలం పాత తాండ గ్రామపంచాయతీకి చెందిన ఇండిపెండెంట్ సర్పంచ్ ఎస్. శ్రీను, ఉప సర్పంచ్ సూర్య, ముగ్గురు వార్డు సభ్యులు, గ్రామానికి చెందిన సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు కేశంపేట సర్పంచ్ సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీను మాట్లాడుతూ, పాత తాండ గ్రామ అభివృద్ధి కోసం, నిరుపేదలకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా పనిచేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్ గౌడ్, ఉప సర్పంచ్ సూర్య, వార్డు సభ్యులు జగపతి నాయక్, రాజేష్, అలాగే శంకర్ నాయక్, బద్రి నాయక్, లచ్చనాయక్, పూర్య నాయక్, బోడ్యా నాయక్, బిచ్చ నాయక్, సింహాద్రి, లక్ష్మణ్, మహేష్, రాజు, చందన్, రమ్య నాయక్, నాను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టల్ ఫ్యాన్సీ స్టోర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

-యువత వ్యాపార రంగాల్లో రాణించాలి

-ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : ఫిబ్రవరి 20ప్రజా జ్యోతి**

యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు.శుక్రవారం జిల్లాకేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులోని శారదా హైస్కూల్ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన “క్రిస్టల్ ఫ్యాన్సీ స్టోర్”ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో రాణించి తమతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని,తమకునచ్చిన రంగాలలో శిక్షణ పొందినట్లయితేబ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకుముందుకు వస్తున్నాయని,తద్వారా చిన్న మధ్య తరహా భారీ వ్యాపారాలు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.యువకులు నేటి కాలానికి అనుగుణంగా అన్ని రకాల నైపుణ్యాలను కలిగి ఉండాలని తమతో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి తమకు నచ్చిన రంగాలలో రాణించాలనిఅన్నారు. వ్యాపార రంగాలలో ఆసక్తి ఉన్న యువకులు ఆర్థికపరంగా ఇబ్బందులు ఉంటే బ్యాంకుల ద్వారా సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు.ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర,వైస్ చైర్మన్బాధం రమేష్,కౌన్సిలర్లు పద్మ,సునీత,ఖాజా ఖాన్, ఎం.డి.నిజామొద్దీన్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడుఖాజాబాబా,కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలరాజ్,బాలపీరు,శ్రీనివాస్ రెడ్డి,పెద్దాపూర్ ఉప సర్పంచ్ బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రిలో చేర్చాలి

ఉమ్మడిజిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్

108 అంబులెన్స్ వాహనం ఆకస్మిక తనిఖీ



**కల్వకుర్తి, ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి)**

సిబ్బంది అప్రమత్తంగా ఉండి క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రిలో చేర్పించాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్ అన్నారు. శుక్రవారం ఊరుకొండ అంబులెన్స్ వాహనాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు అంబులెన్స్ లోని పరికరాలు నిర్వహణ మందుల లభ్యత ఆక్సిజన్ నిలువలను పరిశీలించడంతోపాటు నెలవారి కేసుల సగటు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోన్ వచ్చిన వెంటనే సిబ్బంది అప్రమత్తంగా ఉండి క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్లాలన్నారు. సిబ్బందికి ఎలాంటి సమస్య ఉన్న మా దృష్టికి తీసుకురావాలన్నారు. 108 అంబులెన్స్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు వారి వెంట జిల్లా ఈఎంఈలు బోయిని శ్రీను, శ్రీహరి సిబ్బంది రమేష్, శ్రీనివాసులు, ఉన్నారు

# మూడు నెలలైనా మొక్కజొన్న డబ్బులు జమ కాదు

**-హమాలీలకు చెల్లింపులు చేయలేక అవమానాలు**
**-స్పందించకపోతే సింగిల్ విండో ఎదుట ధర్నా హెచ్చరిక**

**చిన్నంబావి (ఫిబ్రవరి 20) (ప్రజాజ్యోతి):**
మూడు నెలలు గడిచినా మొక్కజొన్న పంటకు డబ్బులు చెల్లించకపోవడంతో చిన్నంబావి మండలం రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2025 నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో సింగిల్ విండో ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్నకు ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని ఆరోపిస్తున్నారు.పంట దిగుబడి తక్కువగా వచ్చినప్పటికీ ప్రభుత్వంపై నమ్మకంతో తమ పంటను విక్రయించామని రైతులు చెబుతున్నారు. అయితే చెల్లింపులు నిలిచిపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. సింగిల్ విండో సొసైటీ సీఈఓ నాగరాజును ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వలేదని రైతులు తెలిపారు.ఎరువులు, పురుగుమందులు, యంత్రాల అద్దెల కోసం అప్పులు తీసుకున్నామని, ఇప్పుడు వడ్డీలు కట్టలేక అప్పుదారులు ఇంటి వద్దకు వస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హమాలీలు, లేబర్ కూలీలు డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో గ్రామాల్లో తలదించుకుని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. పిల్లల స్కూల్ ఫీజులు, పరీక్ష ఫీజులు కూడా చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించకపోతే చిన్నంబావి మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట ధర్నాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.రైతుల వేదనలు

తోముకుంట దేవన్న:
“నేను చేను కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట పండించాను. పండిన పంటను సింగిల్ విండో అధికారులకు విక్రయించాను. రెండు నెలలు దాటినా ఇప్పటికీ నా ఖాతాలో డబ్బులు జమ కాలేదు. అప్పులు చేసి పంట సాగు చేశాను. ప్రభుత్వం త్వరగా డబ్బులు చెల్లించి మమ్మల్ని అప్పుల బాధ నుంచి కాపాడాలి.


మద్దూరు బాలస్వామి

”మద్దూరు బాలస్వామి (గూడెం గ్రామం):
“224 క్వింటాళ్ల మొక్కజొన్నలను సింగిల్ విండోకు విక్రయించాను. రెండు నెలలు గడిచినా ప్రభుత్వం చెల్లింపులు చేయలేదు. హమాలీలు, కోత మిషన్ వర్కర్లు, ఎరువుల షాపు యజమానులు డబ్బుల కోసం మా ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. అవమానంతో గ్రామంలో తిరగలేకపోతున్నా. ప్రభుత్వం వెంటనే మా డబ్బులు చెల్లించాలి.


తూముకుంట దేవయ్య

”ఒంటెల కురుమయ్య:
“33 క్వింటాళ్ల మొక్కజొన్నను కొప్పునూరు సింగిల్ విండోకు అమ్మాను. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. నేను వికలాంగుడిని. అప్పులు చేసి పంట సాగు చేశాను. ఇప్పుడు అప్పుదారులు ఇంటికి వస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే చెల్లింపులు చేయాలి.”ఉప్పరి జోగు గంగాధర్ (కురుమూర్తి):


ఒంటెల కురుమయ్య

“గత సంవత్సరం నవంబర్ 17న మొక్కజొన్నలను కొప్పునూరు సింగిల్ విండోకు విక్రయించాను. డబ్బులు నేరుగా ఖాతాలో పడతాయని చెప్పారు. కానీ ఇప్పటివరకు ఒక్క పైసా పడలేదు. ప్రతిరోజూ కార్యాలయానికి వెళ్లి వస్తున్నా -- ఈ రోజు, రేపు అంటూ సమాధానం ఇస్తున్నారు. పిల్లల స్కూల్ ఫీజులు కూడా కట్టలేకపోతున్నా. ప్రభుత్వం వెంటనే నా ఖాతాలో డబ్బులు వేయాలి.”రైతుల బకాయిలు వెంటనే విడుదల చేసి సమస్య పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


జోగుకురుమూర్తి

# కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరం

**-ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి**





**నాగర్ కర్నూల్: ఫిబ్రవరి 20ప్రజా జ్యోతి**
కల్యాణ లక్ష్మి -షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు వరం అని ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం తెల్కపల్లి మండలానికి సంబందించిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం మరింత సమర్థంగా పనిచేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలనిపిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,మండల ముఖ్య నాయకులు,ప్రభుత్వ అధికారులు,లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్:ఫిబ్రవరి 20ప్రజా జ్యోతి**
గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు.శుక్రవారం కార్వంగ గ్రామం లో నూతనంగా నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికిశంకస్థాపన చేసి పనులను ప్రారంభించారు.అనంతరం పులిజాల నుండి కార్వంగ గ్రామం మధ్య ఉన్న వాగు కారణంగా రైతులు మరియు గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించిన త్వరలోనే వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి సన్మానం

**చిన్నంబావి,ఫిబ్రవరి 20(ప్రజాజ్యోతి)**
చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో పర్యటించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి. చిన్నంబావి మండల పరిధిలోని టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి కేసిరెడ్డి వెంకట్రావమ్మ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి, శాలువతో మర్యాదపూర్వకంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ని సన్మానించడం జరిగింది. చిన్నంబాయి మండలంలోని వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచులు, వివిధ గ్రామాల సీనియర్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.





# సి .ఐ. అప్పయ్యకు యెన్నం ఆశీస్సులు..

**- ప్రజాసేవలో మరింత సమర్థత కనబర్చాలని ఆకాంక్ష**

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎంమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిఆ మహబూబ్‌నగర్ వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అంపయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.జన్మదినోత్సవం సందర్భంగా సి.ఐ. అంపయ్యకు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు న్యాయం, భద్రత కల్పించడంలో మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో నిబద్ధతతో ముందుకు సాగాలని సూచిస్తూ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.